విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 5 అక్టోబరు 2024 | 8 పేజీలు

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన శుక్రవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ముఖ్యమంత్రి బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకట చౌదరి స్వాగతం పలికారు.

వార్త మెయిన్‌లో

అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదు

– జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదని, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరులోని అంబేద్కర్ భవన్ లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కృత్తిమ కాళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావం తులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షింస్తున్నానన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమము కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని ఇందులో భాగంగా ఫ్రీడం ట్రస్ట్, సేవ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో 208 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ.15 వేలు విలువతో మొత్తం రూ.35 లక్షలతో 218 కృత్రిమ కాళ్ళను పంపిణీ చేస్తున్నా మన్నారు. అనంతరం వికలాంగులకు కృత్తిమ కాళ్ళను పంపిణీ చేశారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా యని తెలిపారు. చిత్తూరు జిల్లాలో పరిధిలో అంగవైకల్యం కలిగిన వారికి కృత్రిమ కాళ్ళను

2

చెరువును కబ్జా చేసి...

దర్జాగా రియల్టర్ల రోడ్డు నిర్మాణం

పట్టించుకోని అధికారులు - ఎమ్మెల్యే గారూ... మీరైనా స్పందించండి

విశాలాంధ్ర-తొట్టంబేడు : చెరువును కబ్జా చేసి... రియల్టర్లు దర్జాగా రోడ్డు నిర్మాణం చేసేశారు. పంట పొలాలకు సాగునీటిని అందించే ఆయ కట్టు చెరువును మింగేసినా అధికారులు ఎందుకో పట్టించుకోవడం లేదు. ఇది అక్రమం అని ప్రశ్నించే ప్రజలపై కేసులు పెడతామని రియల్టర్లు బెదిరిస్తున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అయినా స్పందించి రియల్టర్ల చెర నుంచి ఈ చెరువుకు విముక్తి కలిగించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

2

ధ్వజారోహణంతో వైభవంగా

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవం

2

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవాన్ని వ్యాప్తి చేయండి

– టీటీడీ ఈవో జె.శ్యామలరావు

- రాంభగీచా-2లో మీడియా సెంటర్ ప్రారంభం

వార్త 2వ పేజీలో

షార్‌లో... ప్రారంభమైన అంతరిక్ష వారోత్సవాలు

వార్త 2వ పేజీలో

విశాలాంధ్ర-వెదురుకుప్పం:

సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తమ సేవలు అందించి బదిలీ పై మరో కార్యాలయానికి వెళ్లే అధికారులకు మర్యాద పూర్వకంగా స్థానిక ప్రజాప్రతినిధులు, సహచర సిబ్బంది సన్మానాలు చేసి వారి సేవలు కొనియాడే పరిస్థితులు ఉండేవి. రాను రాను అది కాస్తా తారుమారైందని చెప్పొచ్చు.

మర్యాద..కాదయ్యా...!

-బాధ్యతలు చేపట్టే ఉద్యోగులకు సన్మానాలా

- ఆశీస్సులు కోసమే ఆరాటమా

....వార్త 2లో....

దర్గాగా రియల్టర్ల రోడ్డు నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి) ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం గ్రామంలో సర్వే నెంబర్ 22/2, సర్వే నెంబర్ 12లో సుమారు 34 ఎకరాల విస్తీర్ణంలో చెరువు భూమి ఉంది. ఈ చెరువును ఆధారం చేసుకుని రైతులు వ్యవసాయ సాగు చేస్తున్నారు. చెరువుకు నీరు చేరితేనే పంటలు పండే పరిస్థితి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది వైట్ కాలర్ రియల్ ఎస్టేట్ భూబోళ్లు చెరువు భూమిని కబ్జా చేశారు. దాదాపు 20 ఎకరాల వరకు చెరువు భూమిని చెరపట్టి లేఅవుట్ గా మార్చి ప్లాట్లు అమ్మకం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇపుడు కూడా చెరువు భూమిలో లేఅవుట్ వేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అందుకోసం నడి చెరువులో అడ్డగోలుగా లేఅవుట్లోకి వెళ్లేందుకు రహదారి కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు చెరువు భూమినే కబ్జా చేయడంతో ఆయకట్టు రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ప్రస్తుతం చెరువును పూడ్చివేసి ఏకంగా రహదారి ఏర్పాటు చేయడంతో ఇక చెరువుకు నీరు చేరే పరిస్థితి లేకుండా పోతోంది. ఒక వేళ చెరువుకు నీరు చేరినా చెరువు కట్ట తెగిపోయి దిగువ ప్రాంతంలో ఉన్న తమ గ్రామం మీదకు వచ్చి తామంతా జలదిగ్బంధంలో చిక్కుకు పోవాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చెరువును చెరపట్టిన వారు సాగిస్తున్న దందా అంతా ఇంతా కాదు. ఎవరైనా ఈ ఆక్రమంపై ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామన్న బెదిరింపులకు దిగుతున్నారు. చెరువును కాపాడండి మహాప్రభో అంటూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువు భూమినే ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నా అడిగేవారు, అడ్డుకునే వారు లేకుండా పోవడంతో రియల్టర్ల భూ దందాకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. చెరువును కాపాడాల్సిన జలవనరులశాఖతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. బసవయ్యపాళెం చెరువులో ఉన్న కొంత స్మశాన భూమిని కూడా ప్రభుత్వశాఖలో పనిచేసే ఓ అధికారి సైతం ఆక్రమించినట్లు స్థానికులు చెబుతున్నారు. రైతులు వేసిన పంటలకు సాగునీరు అందించే విధంగా ఏర్పాటు చేసిన చెరువును గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా కబ్జా చేసి అమ్మేస్తున్నా తీరుపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యే నిర్ణయంపై ఆశలు శ్రీకాళహస్తిలో ప్రజారంజక పరిపాలన దిశగా అడుగులు వేస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బసవయ్యపాళెం చెరువును మింగేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ రైతులు వేడుకుంటు న్నారు. అధికారులకు అనేక సార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతోందని వారు అంటున్నారు. చెరువులో అక్రమంగా వేసిన రోడ్డును తీసివేయక పోతే... చెరువు కట్ట తెగిపోయి తమ గ్రామాన్ని చుట్టుముడుతుందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదు

(మొదటి పేజీ తరువాయి) అమర్చడం మంచి కార్యక్రమం అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలను అభినంది స్తున్నా నన్నారు. సేవా సంస్థలు కృత్రిమ కాళ్ళు అమర్చడంతో పాటు ట్రై సైకిల్ లు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలకు కావలసిన తోడ్పాటును జిల్లా యంత్రాంగం తరపున, ప్రభుత్వం తరపున అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి శ్రీనివాస్, ఫ్రీడమ్ ట్రస్ట్ బోర్డు మెంబర్ సుదర్శన్ రెడ్డి, బీజేపీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, డెప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, పలువురు అధికారులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

మర్యాద..కాదయ్యా...!

(మొదటి పేజీ తరువాయి) బదిలీల లో భాగంగా ప్రభుత్వ శాఖల కు నూతనంగా బాధ్యతలు చేపట్టే ఆయా అధికారుల ఆశీస్సులు కోసం సాలువలు తో క్యూ కడుతున్నారు.మర్యాద కాదయ్యా అని జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఎందుకంటే ఇదంతా తమ పనుల కోసం కాకాబట్టే యోచనలో భాగమే అని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి.కాగా ప్రభుత్వ అధికారులు కొందరు ఉన్నతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి బదిలీ వెళ్లే అధికారులకు సన్మానాలు గానీ పలకరింపు గానీ చాలా వరకు లేని దైన్యం.ఇలాంటి దుస్థితి ఉన్న క్రమం వెదురుకుప్పం మండలం ముందంజలో ఉందని చెప్పొచ్చు. నూతనంగా బాధ్యతలు చేపట్టే అధికారులకు మాత్రమే సన్మానాలు ఆడంబరాలు అధికంగా ఉంటాయి.సుదీర్ఘ కాలం ప్రభుత్వ సేవలు అందించి బదిలీపై వెళ్లిన అధికారులకు కనీస పలకరింపులు కూడా ఉండవని విచారం వ్యక్తం చేసిన సందర్భాలు కోకొల్లలు అని చర్చిం చుకుంటున్నారు.ఏదీ ఏమైనా అధికారులు బాధ్యతలు తీసుకున్న పుడు వుండే ఉత్సాహం బదిలీపై వెళ్ళినప్పుడు కూడా కనీస మర్యాద కనబరచి స్వార్థం వీడాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

చిందేపల్లి రోడ్డు ఆక్రమించిన ఈసీఎల్

- ప్రత్యామ్నాయ రోడ్డును సైతం ఆక్రమించిన ఈసీఎల్ యాజమాన్యం

విశాలాంధ్ర- ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామానికి పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారికి కలుపుకొని పోయే ఆర్ అండ్ బి రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో ఈసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దౌర్జన్యంగా కబ్జా చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ గ్రామానికి ప్రత్యామ్నాయ రోడ్డుగా రైల్వే ట్రాక్ నుండి జగనన్న కాలనీ మీదగా ఊరందూరు గ్రామానికి వెళ్లే వరవకాలవను పూడ్చి ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రత్యామ్నాయ రోడ్డును కూడా శుక్రవారం ఈసీఎల్ యాజమాన్యం ఆక్రమించుకునేందుకు కుట్రపన్నారు. ఆ కుట్రలో భాగంగా రోడ్డుపై ఓ గేటును ఏర్పాటు చేశారు. అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి చిందేపల్లి గ్రామానికి వెళ్లే వారిని వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు.. ప్రస్తుతం ఆ గ్రామానికి రోడ్డే లేకుండా గేటు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ రోడ్డును కూడా స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు ఆగ్రహించి ఈసీఎల్ కంపెనీ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో చిందేపల్లి రోడ్డు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ప్రత్యా మ్నాయ రోడ్డు కూడా క్లోజ్ చేశారని గ్రామస్తులు ఈసీఎల్ యాజమాన్యాన్ని ప్రశ్నించినా యాజమాన్యం వారు ఎటువంటి సమాధానం చెప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వెంటనే అధికారులు స్పందించి ఈసీఎల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని చిందేపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు... గత వైసిపి పాలనలో మాజీ శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి మా గ్రామానికి తీవ్ర అన్యాయం చేశాడని ఆరోపించారు. దాని ఫలితం మధుసూదన్ రెడ్డి 2024 సాధారణ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడానికి కారణమైందని చెప్పారు. అదే తరహాలో ఈసీఐఎల్ యాజమా న్యం కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.. క్రీస్తు శేషులు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ మా గ్రామానికి అన్యాయం చేయలేదని గుర్తు చేశారు.. గోపాలకృ ష్ణారెడ్డి ఉన్నప్పుడు ఏనాడు మా రోడ్డుకు అడ్డంకులు ఈసీఎల్ యాజమాన్యం సృష్టించలేదని చెప్పారు. ఆయన మరణానంతరం, వైసిపి ప్రభుత్వం లో మధుసూదన్ రెడ్డి ఈసీఎల్ యాజమాన్యానికి కొమ్ము కాశి, కుట్రపూరితంగా యాజమాన్యానికి సహకరించి చిందేపల్లి రోడ్డును అడ్డగించడం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.. స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి చిందేపల్లి గ్రామానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం.ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, తిరుమల చిన్న జీయర్ స్వామి, ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు, ఆగమ సలహాదారులు, టీటీడీ ఈవో జె శ్యామలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవాన్ని వ్యాప్తి చేయండి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమలలోని రాంభగీచా - 2 విశ్రాంతి భవనం మొదటి అంతస్తులో శుక్రవారం మధ్యాహ్నం టీటీడీ ఈవో జె శ్యామలరావు, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సివిఎస్వో శ్రీధర్ మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని, భక్తులకు టీటీడీ అందజేస్తున్న పలు యాత్రికుల సౌకర్యాలను బయటి ప్రపంచానికి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో ఉందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు రాంభగీచా- 2 రెండవ అంతస్తులో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక అన్నప్రసాదం సౌకర్యం కూడా ఏర్పాటు చేయబడింది.ఈ తొమ్మిది రోజుల్లో జరిగే వివిధ ధార్మిక కార్యక్రమాలు సంబంధించి మీడియాకు ఎప్పటికప్పుడు ప్రెస్ నోట్స్ మరియు ఫోటోలను మా పిఆర్ డిపార్ట్మెంట్ విడుదల చేస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులకు శ్రీవారి వైభవాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఆర్వో డాక్టర్ టి.రవి, పిఆర్ఓ(ఎఫ్ఏసీ) పి.నీలిమ, ఇతర కార్యాలయ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

షార్‌లో ప్రారంభమైన అంతరిక్ష వారోత్సవాలు

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) శ్రీహరి కోటలోని ఎమ్మార్ కురుపు ఆడిటర్ నందు శుక్రవారం అంతరిక్ష వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి టెక్నాలజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇస్రో డైరెక్టర్ రాజరాజన్ అధ్యక్షతన కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించి, బ్రోచర్‌ను ప్రారంభించారు. వారం రోజులు పాటు వివిధ ప్రాంతాలలో నాలుగవ తేదీ నుండి పదవ తేదీ వరకు ఈ వారోత్సవాలని నిర్వహిస్తున్నట్లు షార్ డైరెక్టర్ రాజరాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం కల్యాణ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర

భక్తుల నుండి పార్కింగ్ పేరుతో బలవంతపు వసూళ్లు

విశాలాంధ్ర- పుత్తూరు టౌన్: నారాయణ వనం మండలం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర రోజూ వందల మంది భక్తులు వస్తూ ఉన్నారు భక్తులు తీసుకువచ్చే వాహనాలను ఆపి బలవంతంగా పార్కింగ్ ఫీజును వసూలు చేస్తున్నారు భక్తులు దీని పరముగా చాలా ఇబ్బంది పడుతున్నారు మరియు నారాయణవనంలో నివసిస్తూ గుడి దగ్గరికి వాహనాలను తీసుకుని వస్తే వాటికి కూడా బలవంతంగా పార్కింగ్ ఫీజు ఇవ్వాలని లేకపోతే వాహనాలను ఇక్కడ ఎక్కడ నిలపకూడదు అని హుకుం జారీ చేస్తున్నారు భక్తుల పట్ల అమర్యాదగా మాట్లాడి కఠినంగా పార్కింగ్ ఫీజును గుంజుకోవడం చేస్తున్నారు ఈ పార్కింగ్ ఫీజును వసూలు చేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారు అనేది తెలియాల్సి ఉన్నది, ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు గ్రహించి భక్తుల వద్ద పార్కింగ్ ఫీజును నిలుపుదల చేయాలని ప్రజలు మరియు భక్తులు కోరుచున్నారు,

మడిపాకలో అపహరణకు గురైన ఆవు.. యజమానికి అప్పగింత

విశాలాంధ్ర -ఏర్పేడు: ఏర్పేడు మండలం మడిపాక పంచాయతీ రాజుల కండ్రిగ గ్రామంలో గత మూడు రోజుల క్రితం పంట పొలాల్లో మేస్తున్న రైతు భూపతి నాయుడు కు చెందిన ఆవు అపహరణకు గురైంది. దీనిపై యజమాని భూపతి నాయుడు గత రెండు రోజుల క్రితం ఏర్పేడు పోలీసులకు అనుమానితులపై ఫిర్యాదు చేశాడు.. దీనిపై విచారించిన ఏర్పేడు పోలీసులు ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు అరుంధతి వాడకు చెందిన హరి అనే యువకుడు గత మూడు రోజుల క్రితం భూపతి నాయుడుకు చెందిన ఆవును శ్రీకాళహస్తి మండలం తొండమనాడు కు చెందిన శ్రీనివాసులకు విక్రయించాడనీ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఏర్పేడు పోలీసులు తొండమనాడు గ్రామానికి వెళ్లి అపహరణకు గురైన ఆవును గుర్తించి యజమాని భూపతి నాయుడుకు అప్పజెప్పారు.. ఈ ఘటనపై ఆవును అపహరించుకుపోయిన హరిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు... గత 15 రోజుల క్రితం ఎండి పుత్తూరు గ్రామానికి చెందిన 8 ఆవులు ఇదే తరహాలో అపహరణకు గురి అయ్యాయని, దీనిపై రైతులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...

గుడిమల్లం ఆలయంలో కుంకుమార్చన

విశాలాంధ్ర -ఏర్పేడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరుశురామేశ్వర స్వామి దేవాలయంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో కన్నుల పండుగ నిర్వహించారు. మొదటిగా పార్వతి దేవిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.. అనంతరం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పర్వదినాన్ని పురస్కరిం చుకుని స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు.. అదేవిధంగా చిందేపల్లి సిద్దేశ్వరాలయంలో పార్వతి దేవి బాల త్రిపుర సుందరి దేవిగా అవతరించి భక్తులకు దర్శనం కల్పించారు.. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవనానికి లక్ష విరాళం..

విశాలాంధ్ర -ఏర్పేడు: గుడిమల్లం లో నిర్మించదలచిన అన్నదాన భవనానికి బెంగళూరుకు చెందిన మీనాక్షి ఎర్రపరెడ్డి దంపతులు లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడుకు శు క్రవారం అందజేశారు..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీడీఓ

విశాలాంధ్ర – తిరుపతి రూరల్ : ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమా లను సమర్థవంతంగా అమలు చేయడమే కాకుండా, అర్హులం దరికీ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా పనిచేస్తామని తిరుపతి రూరల్ ఎంపీడీఓ కొడగంటి రామచంద్ర తెలిపారు. తిరు పతి రూరల్ ఎంపీడీఓగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరిం చారు.కేవీబీపురం ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై రూరల్‌కు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో జిల్లాలోనే రూరల్ మండలాన్ని నెంబర్‌వన్‌గా నిలుపుతామన్నారు .గతంలో తాము పనిచేసిన కేవీబీపురం మండలాన్ని నెంబర్‌వన్‌గా ఫించన్ల పంపిణీలో నెంబర్‌వన్‌గా ఉండేదన్నారు.గత ఆగష్టు 23వతేదీన నిర్వహించిన ఉపాధి ప్రత్యేక గ్రామసభల్లో గ్రామాలకు అవస రమైన పనులను గుర్తించి,ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.తిరుపతి రూరల్ మండలానికి రూ.2కోట్ల ఉపాధి మెటీ రియల్ కాంపౌండ్ నిధులు మంజూరు అయినట్లు చెప్పారు.ఈ నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్స్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు.ఈ నెల14 నుంచి 21వ తేది వరకు గ్రామాల్లో పండుగ వాతావరణంలో ఈ పనులకు శంఖుస్థాపన కార్యక్రమాలను ప్రారంభిస్తా మన్నారు. బాధ్యతలు స్వీకరించిన పలువురు అధికా రులు...తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్రతో పాటు పరిపాలనాధికారిగా రంగనాథం, సీనియర్ అసిస్టెంట్ నారా పవనమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను పంచా యతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభినందించారు.

గూడూరు ఈఓ పి.అర్.డి.గా మోహన్

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు ఈఓ పి.అర్.డి గా మోహన్ శుక్రవారం గూడూరు పట్టణంలోని ఎం.పి.డి.వో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు . రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా ఓజీలి నుండి బదిలీ పై గూడూరు కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రాధాకృష్ణుల సేవలో చెవిరెడ్డి

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : ఇస్కాన్‌లోని రాధాకృష్ణులను శ్రీకల్యాణ వెంకన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. కల్యాణ వెంకన్న 17వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చెవిరెడ్డి గోవింద మాల ధరించారు. అనంతరం ఇస్కాన్ జాతీయ అధ్యక్షులు రేవతిరమణదాస్ ప్రభు ను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేం దుకు ఇస్కాన్ వెళ్లారు. ఆలయ సంప్రదాయ పద్ధతిలో ఆయన్ని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవ రోజు కల్యాణ వెంకన్నకు పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

ముక్కంటి సేవలో ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్ ఛార్జి ఛైర్మన్

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం ఏపీ ఉన్నత విద్యా మండలి ఇన్ ఛార్జి ఛైర్మన్ రామ మోహన్ రావు దర్శించు కున్నారు. ఈయనతో పాటు ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్, అనంతపురం జేఎన్ టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య కూడా స్వామి వారి సేవకు వచ్చారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజ యస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వ చనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్ మాలిక్, ఆలయ తనిఖీదారు హరి యాదవ్, ఏపీఆర్వో రవి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడులో అక్టోబర్ 8న మెగా జాబ్‌మేళ

విశాలాంధ్ర–సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణంలో అక్టోబర్ 8వ తేదీ మెగా జాబ్ మేళ జరుగుతుందని స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్,సిడాప్,డిఆర్డిఏ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆమె చెప్పా రు. ఈమెగా జాబ్ మేళాలో శ్రీసిటీకి చెందిన మూడు బహుళ జాతీయ కంపెనీలు ఇంట ర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు .టెన్త్,ఇంటర్మీడియట్,ఐటిఐ, డిప్లమో బీటెక్,లేదా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులని తెలిపారు.ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్,విద్యార్హతకు సంబందించిన సర్టిఫికెట్స్ జిరాక్స్,బయోడేటా ఫామ్తో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.అక్టోబర్ 8వ తేదీ మంగళవారం నిర్వహించనున్న మెగాజాబ్ మేళాకు హాజరయ్యా యువతి యువకులు సంబంధించిన రిజిస్ట్రేషన్ లింక్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవలన్నారు.ఈ సదవకాశాన్ని మండ లంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఒక ప్రకటన కోరారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా అంతటి రమేష్ బాబు

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులుగా అంతటి రమేష్ బాబును శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు గౌడ్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ పదవి వచ్చిందన్నారు. ఇకపై గౌడ కులస్తులకు అందరికీ తాను జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాన్ని తహసీల్దారు కార్యాలయానికి తీసుకుపోతే... వారు కుల ధ్రువీకరణ పత్రం ఇస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయ్ కుమార్, కంఠా రమేష్, గౌడ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ దొరబాబు గౌడ్, కార్యదర్శి మోహన్ గౌడ్, కోశాధికారి శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు చిట్టి మునిరత్నం గౌడ్, అరగొండ భాస్కర్ గౌడ్, అనగాని నాగరాజు గౌడ్, తిరకాల ఓం ప్రకాష్ గౌడ్, వివేక్ పాల్గొన్నారు.

సిఎం పర్యటన దృష్ట్యా ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం తిరుమలకు రానున్న నేపథ్యంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు అదనపు ఈవో సిహెచ్. వెంకయ్యచౌదరితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అందులో భాగంగా శ్రీ పద్మావతి అతిథి గృహాన్ని, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వకుళమాత వంటశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, సిఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాయత్రి అలంకారంలో చెంగాలమ్మ

విశాలాంధ్రు–సూళ్లూరుపేట : శ్రీ చెంగాళమ్మ పరమే శ్వరి దేవస్థానము నందు శరన్నవరాత్రులు సందర్భ ముగా రెండవ రోజు సహయ కమీషనరు , కార్యనిర్వహణాధికారి శ్రీమతి బి. ప్రసన్నలక్ష్మీ పర్యవేక్షణలో శ్రీ అమ్మవారికి శ్రీ గాయత్రి అలంకా రము నిర్వహించుట జరిగినది. ఉభయకర్తలుగా శ్రీ గునపాటి మురళి కృష్ణారెడ్డి–శ్రీమతి ప్రతిమ దంప తులు నెల్లూరు వారు వ్యవహరించారు. సూళ్ళూరు గంగమిట్ట, కాపువీధి, కావలి వీధి, శ్రీపొట్టి శ్రీరాములు వీధి, రైల్వే కాలనీలు, శ్రీనగర్ కాలనీ వారు శ్రీ అమ్మవారికి సారెను సమర్పించుట జరిగినది. సాంస్కృతిక కార్యక్రములు శ్రీ రాయుడు బృందం సూళ్ళూరుపేట వారిచే సినీ భక్తిగీత నృత్య ప్రదర్శన నిర్వహించుట జరిగినది.

కార్వేటి నగరం ఎంపీడీవోగా చంద్రమౌళి

విశాలాంధ్ర – కార్వేటినగరం : కార్వేటినగరం ఎంపీడీవో గా చంద్రమౌళి శుక్రవారం పద వి బాధ్యతలు చేపట్టారు. విజయపురం మండలం నుండి కార్వేటినగరం కు బదిలీపై వచ్చారు. కార్వేటినగరం ఇంచార్జ్ ఎంపీడీవో గా లక్ష్మీపతి పని చేశారు. ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

నూతన ఎంపీడీవో చంద్రమౌళిని సన్మానించిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర – కార్వేటినగరం : నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో చంద్ర్ మౌళి నీ మండల టిడిపి పార్టీ అధ్యక్షులు చంగ్రాలాయ యాదవ్, జీడి నెల్లూరు బిసి సంఘ అధ్యక్షులు మేళం రవి యాదవ్ సాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలోమండల టిడిపి ఉపాధ్యక్షులు సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి మండల యువత అధ్యక్షులు మురళి, మండల టిడిపి సీనియర్ నాయకులు మునికృష్ణ, యువ నాయకుడు దేవా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలలో రాణిస్తున్న ఎస్వి సిఈ విద్యార్థులు

విశాలాంధ్ర– తిరుపతి : విశ్వస్తావ్ 2024 పేరుతో కావలిలోని విట్స్ కళాశాల నందు సెప్టెంబర్ నెలలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఆటల పోటీలలో తిరుపతి కి చెందిన ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ ఆటల పోటీలలో బాస్కెట్బాల్ క్రీడల్లో ఎస్వి సిఈ విద్యార్థులు ఫైనల్ రౌండ్ కు చేరుకుని రన్నర్ గా నిలిచారు. అదేవిధంగా తిరుపతిలోని ఐఐటి కళాశాలలో సన్ యోగ 2024 పేరుతో నిర్వహించిన ఆటల పోటీలలో క్రికెట్, వాలీబాల్ ,బ్యాట్మెంటన్ ,అథ్లెటిక్స్ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విన్నర్స్ గా నిలిచారు. ఎస్ వి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న అరవింద్ సారథ్యంలో క్రికెట్ టీ, జై కృష్ణ సారథ్యంలో బ్యాట్మెంటల్ టీం విన్నర్ గా మరియు బాల యోగేష్ సారథ్యంలో వాలీబాల్ టీం రన్నర్ గా, అథ్లెటిక్స్ లో మొదట, రెండవ ,మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో నైపుణ్యం చూపించి కళాశాల స్థాయిని పెంచారని కొనియాడారు. ఇందుకు సహకరించిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కిషోర్ నాయక్, చెన్నయ్య, పార్వతి ,విజయలక్ష్మి, మోహన్ బాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదేవిధంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రదర్శన కనబరచాలని విద్యార్థులకు తెలియజేశారు.

యంబియులో అట్టహాసంగా ప్రారంభమైన మోహన మంత్ర

విశాలాంధ్ర – చంద్రగిరి: యంబియు ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. 4,5,6 తేదీలలో జరిగే పండుగ 4వ తేది ఉదయం 10.00 గం.లకు ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉ త్సవంలో ఉబయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి మంచు విష్ణు మాట్లాడుతూ మన విద్యాసంస్థలు మోహనమంత్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును నైపుణ్యాన్ని వెలికితీయడమే దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. సంస్థ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చిన విద్యార్థులను అతిధులుగా భావించి గౌరవించాలని వారికి ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు డ్యాన్సు చేయడం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ కార్యక్రమాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వినయ్ మహేశ్వరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు యంబియు, ఆచార్య నాగ రాజ రామరావ్ వైస్ ఛాన్సలర్ యంబియు, వికాస్ సింగ్ ఛీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ యంబియు, రిజిస్ట్రార్ డాక్టర్. సారధి, డీన్లు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రధాన ఆకర్షణగా యంబియు ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు. కళాక్షేత్ర కార్యక్రమాలలో భాగంగా అన్ని పోటీలకు వెళ్ళి విద్యార్థులతో కలిసి ఆపోటీలలో పాల్గొని బహుమతులు సంపాదించారు.

పరిశ్రమలకు అనువైన భూములను గుర్తించండి

- దొంగ పట్టాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి
- ఎఫ్.పి షాపుల పునర్విభజన పారదర్శకంగా జరగాలి
- తహసీల్దార్ల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించాలని ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసిల్దార్లతో శుక్రవారం ఆయన రెవిన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పలమనేరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకెళితే ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి అన్నారు. అయితే వారి శ్రామికవేత్తలకు అనువైన భూములతో పాటు తగిన సౌకర్యాలను కల్పించకపోతే పెట్టుబడిదారులను ఆకర్షించలేమన్నారు. కాబట్టి నేటి సౌకర్యంతో పాటు రోడ్డు కనెక్టివిటీ ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం కైగల్ పరిసరల్లోని ప్రభుత్వ భూములతో పాటు పెద్దపంజాణి మండలంలో గుర్తించాలన్నారు. ఇక అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల అందించేందుకు అనువైన స్థలాలను సైతం గుర్తించాలని, గత ప్రభుత్వంలో జరిగిన దొంగ పట్టాల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కోర్టులో నడుస్తున్న రెవెన్యూ కేసుల విషయంలో పురోగతి రావాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న చౌక దుకాణాల పునర్విభజన పారదర్శకంగా జరిగేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ సమీక్షలో తహసీల్దారులు ఇన్నునాదన్, మాధవరాజు, శివ కుమార్, ప్రసన్న కుమార్‌లు ఉన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిమిని రవి నాయుడుకి టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర అధ్యక్షులు అవిలాల వెంకటేశ్ యాదవ్, పార్లమెంట్ కమిటీ సభ్యులు విష్ణు, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాతగా చాముండేశ్వరిదేవి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి దేవి అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భవానీ మాతగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భవానీ మాత అలంకారంలో ఉన్న చాముండేశ్వరి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత సేవను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండల ప్రజలు పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత సేవను సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బారాయుడు ఆదేశాల మేరకు దసరా పండుగ సందర్భంగా ఎవరైనా మీ ఇంటిని వదిలి ఎక్కడికైనా వెళ్తుంటే అట్టి సమాచారాన్ని అనగా మీరు ఏ రోజు నుండి ఏ రోజు వరకు మీ ఇంటికి తాళం వేసి వెళుతున్నారు అనే సమాచారాన్ని పోలీస్ స్టేషన్ నందు గాని లేదా ఎల్ హెచ్ ఎం ఎస్ ఎపి పోలీస్ యాప్ లోకి వెళ్లి మీ వివరాలు, చిరునామా, సెల్ నెంబర్ ఇచ్చి ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకున్న ఎడల మీరు ఊరు వెళ్లి వచ్చేంతవరకు సీసీ కెమెరా పర్యవేక్షణలో మీ ఇంటి మీద నిఘా ఉంచబడుతుం దన్నారు. తాళం వేసి ఉన్న మీ ఇంటి భద్రత కోసం పోలీస్ వారు అందిస్తున్న ఈ ఉచిత సేవను ప్రజలందరూ సద్వినియోగం చేసు కోవాలని చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

వేంకటేశ్వరస్వామి సేవలో కామిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర-నాయుడుపేట: నెల్లూరుజిల్లా మాజీ కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు, వైసిపి సీనియర్ నేత కామిరెడ్డి సత్య నారాయణ రెడ్డి దంపతులు శుక్రవారం స్వర్ణముఖి నదిఒడ్డున నిర్మించివున్న శ్రీ అభయానుగ్రహ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అభిషేక పూజలలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కామిరెడ్డి దంపతులను తిమ్మాజికండ్రిగ మాజీ సర్పంచ్ లోడరి మనోహర్, ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మనించారు.

స్వర్ణముఖిలో మునిగి భక్తుడు మృతి



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: స్వర్ణముఖినదిలో మునిగి ఓ భక్తుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కార్వేటినగరం కు చెందిన చంద్రశేఖర్ (35) అనే వ్యక్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ సమీపంలో స్వర్ణముఖినదిలోని దివ్య కైలాస గంగ స్నాన ఘట్టాల వద్ద స్నానం కోసం వెళ్లాడు. స్నానం కోసం స్వర్ణముఖినదిలో దిగాడు. చంద్రశేఖర్ లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో అక్కడే మునిగి తుదిశ్వాస విడిచాడు. దీంతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి.

మహిళలు, చిన్నారులపై నేరాలను అదుపు చేయండి

బీసీవై యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-పుంగనూరు: రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా మహిళలు, చిన్నారుల పట్ల జరుగుతున్న నేరాలను అదుపు చేయడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని బీసీవై యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కోరారు. పుంగనూరులో ఆరేళ్ళ చిన్నారి అనుమానాస్పద స్థితిలో మరణించిన ఘటన తనను కలచివేసిందని.. దీనిపై బాధ్యులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ తరపున నాయకులు, ప్రతినిధులు చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం సహా భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు రామచంద్ర యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. తక్షణమే రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీ, నగర పాలక సంస్థల్లోని కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేసారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఉమ్మడి కర్నూలు జిల్లా మచ్చుమర్రిలో ఇదే తరహా ఘటన జరిగింది.. ఎనిమిదేళ్ల చిన్నారిపై దారుణ కాండ జరిపి, ఆమె మృతదేహం కూడా కనిపించకుండా చేశారు. ప్రభుత్వం ఆ ఘటనలో వాస్తవాలు ఇప్పటికీ తేల్చలేదు.. ఈ నాలుగు నెలల్లో చీరాల, అనకాపల్లి, నంద్యాల, విజయనగరం, ఏలూరు సహా అనేక ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై నేరాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి ప్రభుత్వం ఎటువంటి కఠిన చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదు..పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయండి.. మహిళల నేరాలపై దర్యాప్తునకు ప్రత్యేక సిబ్బందిని నియమించండి.. అలాగే పట్టాన ప్రాంతాల్లోనూ.. నిర్మాణుయుష్య ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాల నిఘా, పోలీసు నిఘా, పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తే నేరాలు కొంత మేరకు తగ్గుముఖం పెట్టె అవకాశం ఉంటుంది. నేరాలపై సీఎం స్థాయిలో వారానికి ఒకసారి సమీక్ష నిర్వహించి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని నేరాలను అరికట్టాలని రామచంద్ర యాదవ్ కోరారు. పుంగనూరు బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని.. బాధ్యులను గుర్తించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కామాక్షి దేవి అలంకరణలో బంగారమ్మ

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామంలో వెలసియుండు బంగారమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారిని ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. చాముండేశ్వరి, శ్రీధర్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే.ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు తదిత రులు పాల్గొన్నారు. నేనేరమ్మ ఆలయంలో మండలంలోని డిఎం పురం పంచాయతీ దేరాకండిగా గ్రామం వద్ద నైనేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారిని ఏర్పాటు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదారులగ హర్ష ప్రియా, బాలరాజు వివరించారు. అనంతరం అమ్మవారికి ఊంజల సేవ నిర్వహించారు. కార్య క్రమంలో నిర్వాహకులు ఆనందుడు, బొబ్బిలి రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యవేడులో విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సత్యవేడు: విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్యవేడులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో గురువారం రాత్రి వీచిన పెనుగాలులకు స్థానిక కోమటిగుంట ప్రాంతంలో నివసిస్తున్న జమాల్ అలియాస్ సంపత్ ఇంటి ప్రహరీ కంచెపై విద్యుత్ తీగ తెగి పడింది. అయితే తెల్లవారుజామున జమాల్ నిద్ర లేచి బయటకు రావడంతో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. దీంతో జమాల్ అలియాస్ సంపత్ (36) సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ తీగలు తగిలి పడిపోయిన సంపత్‌ను గుర్తించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే సంపత్ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుని బంధువులు కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. దీంతో చెన్నై రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింప చేశారు. సంపత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా కాలం చెల్లిన విద్యుత్ తీగల వల్లే ఇలాంటి విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం లాగిన కాలం చెల్లిన విద్యుత్ తీగలను తొలగించి కొత్త తీగలను ఏర్పాటు చేయాలని సర్వత్ర అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మాజీ మంత్రి కాకానితో వైకాపా నేతలు

విశాలాంధ్ర-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు కెలివేటి సంజీవయ్యతో కలిసి శుక్రవారం నెల్లూరు నగరంలో మాజీ మంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డితో భేటీ అయ్యారు. బ్యాంక్ మాజీ అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మాజీ ఏఎంసి చైర్మన్ జనార్ధన్ రెడ్డి, నాయుడుపేట మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక, సూళ్లూరుపేట మండల అధ్యక్షుడు అనిల్ రెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ఓజిలి మండల పార్టీ కన్వీనర్ హరినాథ్ రెడ్డి లతోపాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నాయకులు, గతంలో నామినేటెడ్ పదవులు అనుభవించిన వ్యక్తులు సంజీవయ్యతో కలిసి కాకానిని ఘనంగా సన్మానించారు. పార్టీ కష్ట కాలంలో పార్టీ అధ్యక్ష పదవి ముల్లకిరీటంతో సమానమని నాయకుల అభిప్రాయపడ్డారు. సరైన వ్యక్తికి, సరైన సమయంలో, పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టిన అధిష్టానానికి నాయకులు కృతజ్ఞత తెలిపారు. కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీకి సూళ్లూరుపేట నియోజకవర్గంలో పూర్వవైభవం తెచ్చే విధంగా, నాయకులమంతా ఐకమత్యంతో పని చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సంఘటనతో గత కొద్దికాలముగా స్తబ్దుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ కనిపించింది.

పాడి రైతులకు షెడ్ల నిర్మాణానికి అనుమతి పత్రాలు జారీ

విశాలాంధ్ర-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాడి రైతులకై ప్రవేశపెట్టిన గోకులాలను శుక్రవారం మండల పరిధిలోని రైతులకు కుప్పం నియోజకవర్గ సమన్వయ కర్త మునిరత్నం మరియు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సుమారు 126 మంది పాడి పరిశ్రమ లబ్ధిదారులకు పశువులు, గొర్రెలు, మరియు మేకల షెడ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అనుమతి పత్రాలను మంజూరు పత్రాలను జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయ ఆవరణలో లబ్ధిదారులకు గోకులాల నిర్మాణాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని ఇందులో భాగంగా పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆవుల షెడ్లతో పాటు గొర్రెల మేకల షెడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతి పత్రాలను పాడి పరిశ్రమ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ, మహమ్మద్ రఫీ, విజయ్ కుమార్ రెడ్డి, ఆదిల్ బాషా మంజునాథ్, వెంకటరమణ మరియు ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసిల్దార్ బాబు ఏపీవో రవి కుమార్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఎటువంటి అపచారం జరగలేదు

వదంతులను నమ్మకండి-టీటీడీ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలి రోజైన ధ్వజారోహణం నాడు, ధ్వజస్తంభంపై గరుడ ధ్వజ పటాన్ని ఎగురవేసే తాలూకు కొక్కి విరిగిపోయిందని, ఇది అపచారమని కొన్ని ప్రసార మాధ్యమాల్లో, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వదంతులు వస్తున్నాయి. శ్రీవారి భక్తులు ఇటువంటి వదంతులు నమ్మవద్దని కోరడమైనది. సాధారణంగా బ్రహ్మోత్సవాల మునుపే ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేసుకోవడం ఆనవాయితీ. ఏవైనా భిన్నమైన వస్తువులు ఉంటే వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చడం సంప్రదాయం.అందులో భాగంగానే భిన్నమైన ధ్వజపటం తాలూకు కొక్కిని అర్చకులు తొలగించి దాని స్థానంలో కొత్త దాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతలో దీనిని అపచారం జరిగినట్లుగా కొన్ని ప్రచార మధ్యమాలు ప్రసారం చేయడం దురదృష్టకరం. తిరుమలలో ఎటువంటి అపచారం జరగలేదని, భక్తులు ఇటువంటి వదంతులు నమ్మవద్దని టీటీడీ మరొకసారి తెలియజేస్తున్నది.

నాగాలమ్మ అవతారంలో అల్లి యల్లమ్మ తల్లి

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీ అల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో దసరా మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్ర వారం నాగాలమ్మ గా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం మూలవిరాట్ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో సురేష్ రెడ్డి పెద్దబ్బ రెడ్డి కుటుంబ సభ్యుల ఉభయ దారులుగా ప్రత్యేక అభిషేకం నిర్వహించి, సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నాగాలమ్మ అవతారంలో పల్లకి యువకులు గ్రామస్తులు తమ భుజాలపై మోస్తూ , పంబ వాయిద్యాలతో ఆలయ మాడవీధులలో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం దాదాపు 500 మందికి రాజేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పార్థసారథి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ గ్రామస్తులు యువకులు భక్తులు పాల్గొన్నారు.

పలువురి మృతికి ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పలువురు నేతల మృతికి శుక్రవారం తన సంతాపాన్ని తెలియజేశారు. పలమనేరు మండలం రామాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కవీంద్రనాయుడు గారి సోదరుడు నాగరాజు నాయుడు మృతికి సంతాపాన్ని తెలియజేశారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇక అదే గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రంగయ్య కొద్దిరోజుల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబీకులను కలిసి పరామర్శించారు.అదేవిధంగా బైరెడ్డిపల్లి మండలం ఆకుల కొత్తూరు గ్రామానికి చెందిన యుగంధర్ గౌడ్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి శుక్రవారం మృతి చెందారు. దీంతో యుగంధర్ గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబీకులకు ఆయన పరామర్శించి తన సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమాలలో బైరెడ్డిపల్లి మండలపార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, పలమనేరు మండల నాయకులు బాలాజీ నాయుడు, బాబు నాయుడు, గాలి రామచంద్ర నాయుడు,వెంకట మునిరెడ్డి, పూర్ణ చంద్ర, ప్రేమ కుమార్ ఆనంద నాయుడు, బత్తి గౌడ్, నాగభూషణం తదితరులున్నారు.

మెరుగైన సేవలు అందించడమే ఆంధ్ర ప్రగతిబ్యాంక్ లక్ష్యం

జనరల్ మేనేజర్ రంజిత్ కుమార్

విశాలాంధ్ర-తడ: గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయిలో కూడా ఖాతా దారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని కడప రీజినల్ జనరల్ మేనేజర్ రంజిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం తడ కండ్రిగలో నూతన భవనం లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతన భవనాన్ని రిబ్బన్ కటింగ్ చేసిన అనంతరం బ్యాంక్ ఖాతా దారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ద్వారా గ్రామస్థాయిలోనే గాక పట్టణ స్థాయిలో కూడా ఖాతా దారులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా వచ్చిన ఖాతా దారులకు త్వరిత గతిన బ్యాంక్ అందించే సేవలను పూర్తి చేసి ఖాతా దారుల వద్ద బ్యాంక్ సిబ్బంది నడుచుకోవాలని కోరారు. చిరు వ్యాపారులకు త్వరిత గతిన రుణాలు అందించి వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడాలని, బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి బ్యాంక్ అభివృద్ధికి సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ టీ.మోహన్ రెడ్డి, చీఫ్ మేనేజర్ సీ.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ ఆర్.ఫణి కుమార్ సింగ్, బ్యాంక్ సిబ్బంది ఖాతా దారులు పాల్గొన్నారు.

కేసిఎస్ గుంటలో రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు కేసీ ఎన్ గుంట సచివాలయం పరిధిలో రైతులకు శిక్షణ కార్యక్రమము చేపట్టడం జరిగింది. వ్యవసాయ అధికారి ఎస్.కవిత మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యంగా బిపిటి వరి రకమును వేసే రైతులు నత్రజని ఎరువులు తక్కువగా వాడుకోవాలి లేదంటే అగ్గి తెగులు నియంత్రణ చేయడము కష్టతరమవుతుంది. పొటాష్ ఎరువును దుక్కిలో 10 కిలోలు వేసినప్పుడు పైరులు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. చివరి దశలో 15 కిలోలు వేసినట్లయితే గింజ నాణ్యత మెరుగు పరుస్తుంది కావున పొటాష్ ఎరువును తప్పనిసరిగా వేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమం లో కెసిఆర్ గుంట సచివాలయం పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

త్రిపుర సుందరిగా చౌడేశ్వరి దేవి

విశాలాంధ్ర-పుంగనూరు: పుంగనూరు మండలం చదళ్లలో కొలువుదీరిన శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వేణుగోపాల్ రెడ్డి సారథ్యంలో గురువారం రాత్రి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఉదయం అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా తీర్చిదిద్దారు. ఉత్సవాల సందర్భంగా ఊరు ఊరంతా అలంకరించుకుందా అన్నట్లుగా చదళ్ల గ్రామం చక్కగా ముస్తాబయింది. పలురాష్ట్రాల నుంచి తెప్పించిన సువాసనలు వెదజల్లుతున్న అనేక రకాలైన పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి నేను గణపతి పూజా గణపతి హెూమం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి హెూమం, పుణ్యా వచనం సప్తమాతృకల ఆరాధన, సప్తమాతృకల హెూమం, శ్రీ చౌడేశ్వరి దేవి మూలమంత్ర పట్టణం హెూమం యాగం నిర్వహించారు అనంతరం శ్రీ చౌడేశ్వరి దేవిని బాలాత్రిపుర సుందరి త్రిపుర సుందరిగా అలంకరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బాలా సుందరీ దేవి అవతార క్రమాన్ని భక్తులకు వివరించారు. ఇదే చదళ్ల గ్రామంలో శుక్రవారం నుంచి ఎన్ వి ఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ ను ట్రస్ట్ అధినేత వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు కర్ణాటక ప్రాంతాల నుంచి ఈ క్రికెట్ పోటీలకు 50 పైగా క్రికెట్ జట్లు రావడంతో, పోటీలను ట్రస్ట్ కార్యదర్శి ఎం శివకుమార్ రెడ్డి సారథ్యంలో ప్రారంభించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ పోటీలలో భాగంగా గెలుపొందిన జట్లకు విజయదశమి రోజున రూ.లక్ష వరకు బహుమతులు పంచుతున్నట్లు ఆయన వివరించారు. శుక్రవారం నుంచి తొమ్మిది రోజులు పాటు రాష్ట్ర ఖ్యాతి సాధించిన వినోదాల బృందాలతో రాష్ట్ర కళాకారులతో ప్రతిరోజు సాయంత్రం వినోదాల వల్లరి నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు.

కలుపు మందుల ప్రభావంతో భూమి నిర్జీవమవుతుంది

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: పంట పొలాలకు అధికంగా కలుపు మందులు వాడకం వలన భూములు నిర్జీవమై పంట సాగుకు పనికి రాకుండా పోతాయని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని వెస్ట్ వరత్తూరు గ్రామంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో సులభ పద్ధతిలో భాగంగా విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు వాడకంతో భూమి సారవంతం కోల్పోతున్నదన్నారు. కలుపు మందులు భూమిలోని జీవరాశిని అంతం చేసి భూమిని నిస్సారం చేస్తుందని చెప్పారు. సక్రమంగా పొలం తయారు చేసుకుంటే కలుపును చాలావరకు నివారించుకోవచ్చని తెలిపారు. వరిలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి ఏఓ వేణుగోపాలరావు వివరించారు. కాకర, మిరప పంటల సాగు, చీడల నివారణ గురించి రాస్ కె.వి.కె శాస్త్రవేత్త సుధాకర్ రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి భారతి, మండలంలోని వ్యవసాయ శాఖ అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు భరత్, భరత్ కుమార్‌లు తుమ్మల కన్నయ్య నాయుడు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి

విశాలాంధ్ర-తిరుపతి: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు నిధులను అధికార పార్టీ నాయకులు దుర్వినియోగం చేయకుండా కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కెవిబి పురం నందు భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశం నుద్దేశించి బిల్డింగ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీరాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలు కోల్పోయిన అందమైన భవనాలు నిర్మిస్తున్న ఏ ఒక్క భవన నిర్మాణ కార్మికునికి కూడా సొంత ఇల్లు లేకుండా బతకడం దారుణం అన్నారు. ఈ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం వామపక్ష పార్టీల ప్రతినిధిగా కేంద్ర హెూం మంత్రి గా ఉన్న ఇంద్రజిత్ గుప్తా పోరాట ఫలితంగా మీ సంఘానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. కానీ ఆ నిధులు ను పాలకులు దుర్వినియోగం చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కష్ట జీవుల కోసమే ఎర్ర జెండా అండగా ఉంటూ కార్మికుల సమస్యలు కోసం పోరాడుతుందని ఆ పోరాటం లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు మోహన్ మనీ యేసయ్య సుబ్రహ్మణ్యం వాసు తమాస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పలమనేరులో ఫ్రైడే -డ్రైడే

విశాలాంధ్ర-పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని కిట్టన్న మిషన్ వీధిలో ఫ్రైడే లో భాగంగా ఇంటింటికి దోమ లార్వా ను గుర్తించి అలాగే మంచినీటి నిలువులపై మూతులు పెట్టుకోవాలని వారానికి ఒకసారి గృహంలోని ప్రతి నీటి నిల్వలను పారవేసి మరలా కొత్త నీటిని నింపుకొని వాడాలని తప్పకుండా మూతలు పెట్టుకోవాలని ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు దోమ కాటు వలన వచ్చు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఒక్కరూ సాయంకాలం ఇంటి తలుపులుకి మూసివేయాలని అలాగే దోమ నిర్మూలన కొరకు వీలైతే వేపాకు పొగని తీసుకోవాలని దోమతెరలు తప్పక వాడాలని వృద్ధులను చిన్న పిల్లలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్ మరియు సబ్ యూనిట్ అధికారి జయశంకర్, ఏఎన్ఎం అమ్ముడా, ఆశ రమాదేవి పాల్గొన్నారు.

నైపుణ్యత పెంపుదల మీద శిక్షణ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం ద్వారా నైపుణ్యత పెంపుదల మీద శిక్షణా కార్యక్రమం, సూళ్లూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు (జిల్లా వనరుల కేంద్రం), లక్ష్మీదేవి మరియు శశిధర్ రెడ్డి, కవిత, అనురాధ, సుభాషిని, మరియు మూడు మండలాల లు హాజరైనారు. ఈ శిక్షణలో వ్యవసాయ అధికారులు సిబ్బందికి రబీ సీజన్లో వేయవలసిన వరి రకాలు మరియు వారిలో ఎరువుల యాజమాన్యం మరియు పురుగుల తెగుళ్లు గురించి అవగాహన కల్పించారు. వరి పంట కాలము ఎన్ని నెలలు అయితే అన్ని వారాల నారును నాటుకోవాలని తెలిపారు. మరియు వరిలో విత్తన శుద్దితో చాలావరకు తెగుళ్లను ముఖ్యంగా అగ్గి తెగులు మరియు పాము పొడ తెగులును అరికట్టవచ్చు అని తెలిపారు. రైతులకు విత్తన శుద్ధి గురించి అవగాహన కల్పించి చేసేలా ఏర్పాట్లు చేయమని తెలిపారు. మరియు నీటి యాజమాన్యం గురించి చెబుతూ వారి నాటిన తర్వాత 30 రోజుల వరకు పలుచగా నీరు ఉండే విధంగా చేసినట్లయితే పిలకలు ఎక్కువ పెట్టే అవకాశం ఉంటుంది అని తెలిపారు.

హెచ్ఐవిపై కోర్ సంస్థ విస్తృత అవగాహన

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే మనం సంతోషంగా ఉండగలుగుతామని కోర్ సంస్థ ప్రతినిధి తులసి అన్నారు. కొన్ని పరీక్ష చేయించుకుంటేనే వ్యాధులు ఉన్నాయా లేదా అని తెలుస్తుంది, అందులో భాగంగానే హెచ్ఐవి ఎయిడ్స్ అనే వ్యాధి గురించి తెలియక చాలా మంది ఎయిడ్స్ బారిన పడుతున్నారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది, వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, కండోమ్ యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఎస్‌టిఐ, టిబి, హెచ్‌బివి ఎజి, హెచ్ సివి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. యర్రావారిపాళ్యం మండలంలో కోర్ సంస్థ ఎన్జీవో వాళ్లు గ్రామస్తుల ఆధ్వర్యంలో "మీకు తెలుసా" హెచ్ఐవి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దళితవాడల్లో మౌళిక వసతులు కల్పించండి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు అంబేద్కర్ భవనం వద్ద పుత్తూరు మండల పార్టీ సభ్యుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్వణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొని మాట్లాడుతూ పుత్తూరు మండలంలో ఎస్సీ ఎస్టీ బీసీ గ్రామాల్లో స్మశాన వాటికలు లేకపోవడం చాలా దారుణమని అన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికి కూడా కాలువల పైన, చెరువుల్లో, చెరువు కట్ట పైన దహన సంస్కరణ చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. సిపిఐ డిహెచ్‌పిఎస్ దళిత కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలో ఉన్న అన్ని గ్రామాలు తిరిగి స్మశాన వాటిక లేని గ్రామాన్ని సమీకరించి స్మశాన వాటిక ఏర్పాటు చేసేంతవరకు పోరాడుతామని అన్నారు. కొన్ని గ్రామాల్లో స్మశాన వాటికి దారి లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వేణుగోపాలపురం సాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని, ఆయకట్టు రైతులకి ఆ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు నాలుగు వేల ఎకరాలకు కూడా నీరు అందుతుందని, ప్రతి బావిలో, బోరులో నీరు పుష్కలంగా అందుతుందని తెలిపారు. గతంలో టిడ్కో ఇల్లు నిర్మాణం చేపట్టి అరాకొరగా వదిలేసారని, లబ్ధిదారులకు ఇంతవరకు అందజేయలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి టిడ్కో లబ్ధిదారులకు పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేసి ఇవ్వాలని, లబ్ధిదారులు అందరు అప్పు చేసి డబ్బులు చెల్లించారని, వాళ్ల కల ఇంతవరకు నెరవేరలేదని ఆవేదన చెందారు. వీటన్నిటి పైన భవిష్యత్తు పోరాటం రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ పుత్తూరు కార్యదర్శి మహేష్ ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీరాములు జానపద కళాకారుల జిల్లా కార్యదర్శి ముకుంద, నాయకులు గోపి, గణేష్, రమేష్, వెంకటేష్, అనిల్, భాస్కర్, రమణ, కుమార్, రంజీవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమీనాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమరగదాంబిక

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో కన్నుల పండుగగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీమరగ దాంబిక అమ్మవారు శ్రీమీనాక్షి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. రెండవ రోజు శ్రీమీనాక్షి అలంకార పూజా కార్యక్రమాలకు సంబంధించి ఉభయదారులుగా శ్రీ భారతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీమరగదాంబికా అమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకం, యాగశాల మండపం నందు కలశ పూజ, వేదపారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రము శ్రీమరగతాంబిక అమ్మవారికి పంచామృతములతో మహాభిషేకం,ధూపదీప నైవేద్యములతో మహాదీపారాధన కార్యక్రమం చేపట్టడం జరిగినది. ప్రదోష మండపం నందు అమ్మవారి ఉత్సవమూర్తికి అమ్మవారికి వివిధ రకాల పుష్పములు, ఆభరణములతో అలంకరించి లలితా సహస్రనామార్చనలు, ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఆలయ ఈవో లతా పర్యవేక్షణలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

విశాలాంధ్ర-చౌడేపల్లి: స్థానిక మండల పరిపాలన భవనంలో శుక్రవారం భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ వారి సహకారంతో రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి సంతోషి కుమారి తెలిపారు భూసార పరీక్షల సంబంధించిన సామాగ్రి అందరికీ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఇప్పటికే సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని ఆమె అన్నారు. రైతులు ఎటువంటి రుసుము చెల్లించకుండానే ఉచితంగా వారి భూమికి సంబంధించిన భూసార పరీక్షలు పొందవచ్చునని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పరిధిలోని పుత్తూరు, నారాయణ వనం, వడ మాల పేట, రామచంద్రా పురం మండలాల్లో మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ తెలిపారు. అయితే మద్యం దుకాణం లైసెన్స్ కొరకు దరఖాస్తు చేయదలచిన వారు ఈ నెల 9 వ తేది సాయంత్రం 5 గంటలలోపు ఆన్ లైన్‌లో గానీ, ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేయదలచిన వారు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి తిరుపతి వారి పేరు మీద 2 లక్షలు రూపాయలు డిడి తీసుకుని దరఖాస్తును పుత్తూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ వద్ద పూర్తి చేయాలని తెలిపారు.అలాగే లైసెన్స్ ఫీజ్ కింద పుత్తూరు టౌన్‌కు 65 లక్షల రూపాయలు నారాయణ వనం, వడమాల పేట,రామ చంద్రా పురం మండలాలకు 55 లక్షల రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలియజేశారు. ఈ నెల 11వ తేదీ తిరుపతిలోని తిరుచానూరు రోడ్డులో వున్న శిల్పా రామం అర్బన్ హాట్ వద్ద లాటరీ ద్వారా డ్రా తీస్తారని పేర్కొన్నారు. 12వ తేదీ నుంచి మద్యం దుకాణాలు ప్రారంభించుకోవచ్చన్నారు. లైసెన్స్ కోసం వచ్చే వారు ఆధార్ కార్డు ఒరిజినల్, మూడు జిరాక్స్ ఆధార్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ ఫోటో లు, బ్యాంక్ పాస్ బుక్, ఓటర్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ తప్పక తీసుకుని రావాలాన్నారు.

ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన 'డాలర్స్' దివాకర్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కు డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ సి దివాకర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో చంద్రబాబు నాయుడును డాలర్స్ దివాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ శరన్నవరాత్రుల విశిష్టతను తెలియచేశారు. అనంతరం అందరికీ అమ్మవారి ఆశీసులు ఉండాలని ఈ శరన్నవ రాత్రి ఉత్సవాలు జరుపు కుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంకీ అనూష, ఏవో రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల త్రిపుర సుందరీ దేవిగా బోయకొండ గంగమ్మ

పట్టు వస్త్రాలు సమర్పించిన పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా బాబు

విశాలాంధ్ర-చౌడేపల్లి: శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా మహోత్సవాలలో భాగంగా తొలి రోజున అమ్మవారిని బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు ఉదయాన్నే వేద పండితులు అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరణ నిర్వహించారు బెంగళూరుకు చెందిన ఎం ఎల్ సి రామోజీ గౌడ మంజుల మూలభాగలు నటరాజ రేణుక మదనపల్లి మురళి బాబు కన్యాకుమారి పులిచెర్ల సుందర్ రెడ్డి జ్యోతి కాకినాడ అశోక్ కుమార్ ఇందిరా ప్రియదర్శిని మదనపల్లి ఎల్లయ్య జానకి చౌడేపల్లి గాజుల పద్మావతమ్మ రాధాకృష్ణ శిరీష బెంగళూరు నరసింహమూర్తి సరస్వతి శ్రీకాళహస్తి జగదీశ్వర్ రెడ్డి సుజాతమ్మలు ఉభయదారులుగా వ్యవహరించారు వారిని ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో ఆహ్వానించి వివిధ హోమాల అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన చల్లా బాబు: బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు ఆయనకు ఆయన కుటుంబ సభ్యులకు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శన భాగ్యం అనంతరం వేద ఆశీర్వాదం హోమంలో పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో యువ నేత మాదిరాజు ప్రదీప్ రాజు లక్ష్మణ రాజు (పతి రాజు) ఆవుల రామచంద్రయ్య శ్రీధర్ రాజు కార్తీక్ బోయకొండ సుబ్బు సోమశేఖర్ రెడ్డి ప్రసాద్ సూపర్ మార్కెట్ హరి సాగర్ నాయుడు జంపాల శ్రీనివాసులు నాయుడు పవన్ కుమార్ బోయకొండ రెడ్డి నారాయణ రాజు ప్రభాకర్ గిరి నాయుడు పరమేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అస్సియా మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

- సిపిఐ, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: పుంగనూరులో ఇటీవల చిన్నారి అస్సియా హత్యకు కారకులైన వారిని కఠిన శిక్షించాలని సిపిఐ ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆ చిన్నారికి ఆత్మ శాంతి కలగాలని చిత్తూరు గాంధీ గ్రామం వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం లోని పుంగనూరులో అభం శుభం తెలియని 06 సంవత్సరాల అస్సియా అనే చిన్నారి మిస్సింగ్ కావడంతో వారి తల్లి దండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిత్తూరు జిల్లా ఎస్పీ వెంటనే స్పందిస్తూ 11 టీములు వేయడం జరిగింది. అయినప్పటికీ అస్సియాను గుర్తించడంలో పోలీస్ అధికారులు ప్రయత్నం చేసిన మిస్సయిన అస్సియా గుర్తించే పనిలో పోలీసులు ఉండగా గురువారం సమ్మర్ ట్యాంకులో చిన్నారి శవాన్ని కనుక్కోవడం తెలిసింది. అస్సియ మరణానికి కారకులైన నిందితున్ని గుర్తించి కఠినంగా శిక్షించాలని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో సిపిఐ ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు మరణించిన చిన్నారి తల్లిదండ్రులకు సిపిఐ ఏఐఎస్ఎఫ్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసరి చంద్ర, కె.రమాదేవి, పి.రఘు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బాలసుబ్రమణ్యం, ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, రామకృష్ణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు నాయకులు కె.విజయ గౌరీ ఏ.జమీలాబీ, పి.కవిత, లతా రెడ్డి, ప్రియ, ఆరుముగం మొదలీ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఎంపీడీవోగా సురేష్ బాబు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడు పేట ఎం.పీ.డీ.వో.గా సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా పెళ్లకూరు ఎంపీడీవో గా పనిచేస్తున్న, సురేష్ బాబు నాయుడు పేటకు బదిలీ అయ్యారు. సూళ్లూరుపేట ఎంపీడీవోగా పనిచేస్తున్న ప్రమీలరాణి పెళ్లకూరు మండలంకు బదిలీ అయ్యారు. నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం నందు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హరిహర రెడ్డి,జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దయాకర్ నెల్లూరు జిల్లాపరిషత్ కార్యాలయంకు బదిలీపై వెళ్లారు. సురేష్ బాబును వేద పండితులు ఆశీర్వదించగా, ఆయన బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ టైపిస్ట్ ఆనంద్ తోపాటు కార్యాలయ సిబ్బంది సురేష్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

హెూం నీడ్స్ ప్రో అప్లికేషన్ యాప్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : గృహ అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా హెూం నీడ్స్ ప్రో అప్లికేషన్ యాప్ ను శుక్రవారం ఓ ప్రవేటు హెూటల్లో హెూం నీడ్స్ ప్రో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కిన్నెర బాలాజీ మాట్లాడుతూ గృహ సేవా అవసరాలను తమ యాప్ ఒక చిన్న క్లిక్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గృహ సేవా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు చేయడమే మా లక్ష్యమని పేర్కొన్నారు. గూగుల్ ప్లేలో మా యాప్ను డౌన్లోడ్ చేసుకు నామమాత్రపు రుసుముతో మా సేవలను పొందవచ్చని తెలిపారు. సౌలభ్యం, నాణ్యత, సంతృప్తిని వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా సేవలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కార్పెంటర్, ప్లంబింగ్, హౌస్ కీపింగ్, బ్యూటీషన్ వంటి ఐదు గృహ సేవా అవసరాలు అందుబాటులో ఉన్నాయని, రాబోవు కాలంలో మరిన్ని గృహ సేవ అవసరాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్.బి.కే.ఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

విశాలాంధ్ర-కోట: కోట మండలం విద్యానగర్ ఎన్.బి.కే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్న కొల్లూరు సందీప్ కుమార్‌కి ఎ స్టడీ ఆన్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ మోడిఫైడ్ విత్ ఫెర్రో సిలికా స్లాగ్ అగ్రిగేట్, పారాఫిన్ వాక్స్ క్యూరింగ్ కాంపౌండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ ఆన్సిస్ మోడల్ అనే అంశం పై డా పి.వి.సుబ్బారెడ్డి, డా ఈ.అరుణకాంతి ల పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ జవహర్ లాల్ నెహ్రూ శాస్త్ర సాంకేతిక విశ్వవిద్యాలయం - అనంతపురం, డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా వి.విజయ కుమార్ రెడ్డి, సివిల్ విభాగాధిపతి డా డి.శ్రీనివాస్, ప్రొఫెసర్ డా పి.వి.సుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలం నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం.వెంకటసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఆర్ఐగా ఇక్కడ పనిచేశారు. తదుపరి డిప్యూటీ తహసీల్దార్ గా పదోన్నతి చెంది బదిలీలో భాగంగా ప్రస్తుతము డిప్యూటీతహసీల్దార్‌గా వరదయ్యపాలెం మండలం నందు బాధితులు స్వీకరించారు.

దేవిడ్ రీస్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఏర్పేడు: ఏర్పేడు నందుగల డేవిడ్ రీస్ ఆసుపత్రిలోని భవనాన్ని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. బొజ్జల కుటుంబం చేసిన సేవలకు గాను ఆ ఆసుపత్రి లోని ఒక భవనానికి బొజ్జల భవనమని నామకరణం చేసినట్లుగా ఆ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ ఎలమంచిలి ప్రవీణ్ అన్నారు. 1970వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి దాదాపు 20 వేల మందికి సేవలను అందించినట్లు మరియు ఆ సేవలకు బొజ్జల కుటుంబం మూడు తరాలుగా ఎమ్మెల్యే తాతగారైనగారైన బిజీ సుబ్బరామిరెడ్డి తదనంతరం ఎమ్మెల్యే తండ్రిగారైన బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఈ ట్రస్ట్‌కి అధ్యక్షులుగా ఉంటూ ఎనలేని సేవలు అందించారు. ఇప్పుడు అదే విధంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తోడ్పాటును అందిస్తున్నారని ప్రవీణ్ అన్నారు. అనంతరం ఏర్పేడు లోని మెర్సీ క్లినిక్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మా తాత మరియు మా తండ్రి ఈ ఆసుపత్రికి అనలేని సేవలు అందించారని నేను కూడా ఈ ఐదు సంవత్సరాలలో ఈ ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పాటున అందిస్తానని హామీ ఇచ్చారు. డివిఆర్‌హెచ్ ఆసుపత్రి జనరల్ ఆసుపత్రిగా మార్చడం మరియు అన్ని జబ్బులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఐఎస్ఎస్ అధ్యక్షులు డాక్టర్ శంకర్ ప్రసాద్ రెడ్డి, ఫౌండర్ మెంబర్ బైకిరెడ్డి, డేవిడ్ రీస్ ఆసుపత్రి డైరెక్టర్ ఏరిన్ రీస్, డాక్టర్ స్వాతి కరణం, డాక్టర్ ప్రతాప్ నాయుడు, విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు గ్రామానికి చెందిన నాగరాజా రెడ్డి కుటుంబం శుక్రవారం ఇంటిలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కుమారుడు దినేష్ 22 భార్య జయంతి 45 కుమార్తె సునీత 26 నలుగురు కలిసి ఇంటిలో పురుగుల మందు సేవించారు. కొద్దిసేపటి తర్వాత అరుపులు విన్న గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో వీరిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గంగాధర్ నెల్లూరు సిఐ లక్ష్మీనారాయణ ఏఎస్ఐ ఆంజనేయులు రెడ్డి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు గంగాధర్ నెల్లూరు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు బెట్టింగ్‌లో 20 లక్షలు అప్పు అయిపోవడంతో ప్రధాన కారణంగా పోలీసులు తెలిపారు.

ఏపిఎం కవితను సన్మానించిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-కార్వేటి నగరం: మహిళ సమైక్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారిని కవితను టిడిపి నాయకులు మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రా యాదవ్, జీడి నెల్లూరు బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్, కార్యదర్శి రాజేందర్ రెడ్డి, పరంధాం, దయానిధి, మురళి, మునికృష్ణ, దేవా రెడ్డి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

రొంపిచర్ల ఎంపిడీవోగా మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-రొంపిచెర్ల: రొంపిచెర్ల ఎంపిడిఓగా గంగవరంలో పనిచేస్తున్న ఎంపిడీవో మధుసూదన్ రెడ్డి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజేంద్ర సెలవుపై వెళ్లడంతో ఎంపిడీవోగా బాధ్యతలు చేపట్టారు.

మేకల దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మేకల దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. వివరాలు లోకి వెళితే.. మండలం లోని వివిధ ప్రాంతాల్లో మేకలు దొంగతనం చేసిన వారిద్దరి నుంచి 7 మేకలు, ఒక మోటారు బైక్, అలాగే ముద్దాయిల నుంచి రికవరీ చేసిన మొత్తం విలువ 2 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ముద్దాయిలు పెనుమూరుకు చెందిన బి చెంచయ్య (42), తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి కి చెందిన సి.సరత్ బాబు (29) లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

అట్టహాసంగా ప్రారంభమైన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం వైఖానస ఆగమోక్తంగా జరిగిన ధ్వజారోహణంతో ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. పెద్దశేషునిపై పరమపథ నాథుడు శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం రాత్రి 7.30 నుండి 9.30 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు ఏడుతలల పెద్ద శేష వాహనంపై పరమ పదనాథుని అలంకారంలో మలయప్ప స్వామి అనుగ్రహించారు. కంకణ ధారుడైన చెవిరెడ్డి తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కంకణ ధారణ చేసుకున్నారు. శుక్రవారం ఉదయం అభిషేక సేవలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత గోవింద మాల ధారణ చేశారు. గోవింద మాలతో దీక్ష చేపట్టిన చెవిరెడ్డి ఈనెల 12వ తేదీ జరిగే బ్రహ్మోత్సవాలు ముగింపు తర్వాత దీక్షను విరమించడం ఆనవాయితీ.

ఆన్‌లైన్‌లో మార్చేశారు: వికలాంగుడి ఆరోపణ

విశాలాంధ్ర-గంగవరం: మండలం లోని మామడుగు రెవిన్యూ, చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం తమ భూమిని ఇతరులకు ఆన్లైన్ మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మామడుగు రెవిన్యూ లెక్కదాఖలాలో ఉన్న (767/5బి, 767/6ఎ-2.80) ఎకరాల విస్తీర్ణంలో 0.70సెంట్లు భూమి రామక్రిష్ణకు పట్టా పాసుబుక్ ఇవ్వడం జరిగింది. కుటుంబ కలహాలతో హైకోర్టును ఆశ్రంచగా 2023లో హైకోర్టు ఈ భూమిపై ఎటువంటి క్రయవిక్రయాలు జరగరాదని ఆదేశాలు జారీ చేసి ఉన్నా కానీ, గంగవరం రెవిన్యూ అధికారులు కోర్ట్ ఆర్డరును కనీసం గౌరవించ కుండా పట్టించుకోకుండా ఎటువంటి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండా, టి.రామక్రిష్ణ పట్టా పాసుబుక్ ను ఆన్లైన్ లో తొలిగించి వేరే వేరే సబ్ డివిజన్స్ చేసి మొత్తం 2.80 విస్తీర్ణాన్ని, టి.కళావతి నుండి వారికుటుంబానికి ఎటు వంటి సంబంధం లేని మరియు పక్క రెవెన్యూ అయిన గండ్రాజుపల్లి, ఆలకుప్పం చెందిన కె. హేమకుమార్ /కె. రాజన్న ఖాతా(1597) పై ఆన్లైన్లో మార్చడం ఎంతవరకు న్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేశారుటి.రామక్రిష్ణ తిరగలేని పరిస్థితి మరియు అతని కుమారుడైన నేను టి.సుబ్రమణ్యం వికలాంగుడను సదరు విషయంపై ఎన్ని సార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా వారి మనసు కరగలేదు, నా కుటుంబానికి ఇప్పటికి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నా భూమి నాకు చెందేటట్లుగా కోరారు. లేదంటే ఈ విషయాన్ని జిల్లా వికలాంగుల సేవా సమితి మరియు జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కండి: కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు: జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపు నిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ సిద్ధం చేయవలసి ఉన్నదని, అన్ని వర్గాల నుండి సూచనలు సేకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ శుక్రవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం నందు స్వర్ణాంధ్ర 2047 విజన్ సంబంధించి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ జి ఓ లు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామి కవేత్తలు, వన సం రక్షణా సమితి, ఎఫ్ పి ఓ లు, ప్రొగ్రసివ్ ఫార్మర్స్, జిల్లా సమాఖ్య సభ్యులు, తదితరుల నుండి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా రానున్న 5 సం.లకు 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టలవలసిన కార్యాచరణ ప్రణాళికల డాక్యుమెంటరీ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో వైద్య సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంపద, పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి సూచ నలు ప్రభుత్వానికి డాక్యుమెంటరీ రూపంలో సమర్పించాలని అన్నారు. ఇప్పటి వరకు రైతులు, ఎస్ హెచ్ జి గ్రూప్ లు, ప్రభు త్వ ఉద్యోగుల నుండి కొన్ని సూచనలు సేకరిం చడం జరిగిం దనన్నారు. జిల్లా స్థాయి విజన్ ప్లాన్ తయారీకి అక్టోబర్ 15 న ఆఖరు తేది అని, సలహాలు, సూచనలు చేయాలని తెలిపారు. జెడ్ పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఉపాధి అవ కాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. పుంగనూరు, కుప్పం ప్రాంతా లలో హార్టికల్చర్ పై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువ అని ఆ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ రావలసి ఉన్నదని, దీనితో పాటు పశు సంపద అధికంగా ఉన్నందున డెయిరీ అభి వృద్ధి చేయవలసి ఉందని సూచించారు. యూనివర్సిటీ లు స్థాపన జరగాలని, కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందిం చడానికి ముందడుగు వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన పలువురు సూచనలు చేస్తూ విద్య, వైద్య రంగాల పరంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి కేంద్రంగా అభివృద్ధి జరిగిందని, జిల్లాలో పునర్విభజన తరువాత చిత్తూరు జిల్లాను విద్య, వైద్య, పారిశ్రామికంగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, ఉద్యాన రంగానికి సంబంధించి మామిడి, టమోటా పంట ఎక్కువగా ఉన్నదని, టమోటా సాగులో నాణ్యమైన విత్తనాలను అందజేయాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగు ణంగా పంచాయ తీల వారీగా గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు మేలు జరుగుతు ందని, వ్యవసాయ కూలీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, చిన్న యంత్రాల పరికరాలను పంపిణీ చేయడం ద్వారా కూలీల సమస్యలను అధిగమించ వచ్చునని రైతుల తరఫున సూచించారు. వ్యవసాయంతో పాటు జిల్లాలో పాడిపరిశ్రమ పై ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారని, పాడి పశువుల ద్వారా పాలను మాత్రమే విక్రయించి ఆదాయం పొందుతున్నారని, గో మూత్రం, పేడను ఆదాయ వనరుగా మార్చుకునే అంశం పై పాడి రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుం దని సూచించారు. ఎఫ్ పి ఓ ల ద్వారా నాణ్యమైన కూరగాయా లను ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి వినియోగించుకునేలా విధానపరమైన నిర్ణయం చేపట్టడం ద్వారా అటు రైతులకు మేలు జరగడంతో పాటు విద్యార్థులకు కూడా తాజా కూరగాయలను అందించడం ద్వారా వారి ఆరోగ్య సంరక్షణకు మార్గం ఏర్పడు తుందని సూచిం చారు. రైతులకు సమీకృత వ్యవసాయం పై గొర్రెలు, మేకల పెంపకం ద్వారా రైతులకు ఎక్కువ ప్రయోజ నాలు కలవనే అంశాల పై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జే సి జి. విద్యాధరి, జెడ్ పి సి ఈ ఓ రవి కుమార్ నాయుడు, సి పి ఓ సాంబశివా రెడ్డి, హౌసింగ్ పి డి పద్మనాభం, డి ఎం అండ్ హెచ్ ఓ డా. ప్రభావతీ దేవి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖఅధికారి రాజ్య లక్ష్మి, ఇతర జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట విమానాశ్రయంలో
చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమా నాశ్ర యం చేరుకున్న ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం లభిం చింది. స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఎమ్మె ల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు కార్యక ర్తలు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఇజ్రాయిల్ -ఇరాన్ మధ్య ఉద్రిక్తత ఆందోళన కలిగిస్తుంది

చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

విశాలాంధ్ర -చిత్తూరు : ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితి ఆందోళన కలిగిస్తుందని చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య నెలకొన్న ఈ పరిణామాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపనుందని ఆయన తెలియజేశారు. ఇజ్రాయెల్ , ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పూర్తి స్థాయి యుద్ధానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సుదూర సంఘర్షణలు భారతదేశం పై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దీనివల్ల అనేక ఇబ్బందులకు గురైయ్యే అనేక దేశాలలో భారతదేశం కూడా ఉందన్నారు. దేశాన్ని ప్రమాదంలో పడేసే ముఖ్యమైన కారకాల్లో ఇందనం ఒకటిని , 80 శాతం చమురును గల్ఫ్ దేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోందని . ఈ పరిణామాలతో చమురు సరఫరాకు ముప్పుగా పరిణమి స్తోందన్నారు. ఈ క్రమంలోనే ఇంధనపు ధరలు కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు.ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రభావాన్ని సృష్టిస్తుందని పేర్కొన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు రవాణా వంటి వాటి పై ఎక్కువగా ఆధారపడే రంగాలు ఖర్చులను అనుభవించవలసి వస్తుందన్నారు. వస్తువులు, సేవల ధర పెరిగేకొద్దీ, ఇది సగటు భారతీయ కుటుంబాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందనీ. ఆదాయాలను తగ్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పూర్తి స్థాయి యుద్ధంగా పెరిగే ప్రమాదం ఉందనీ. ఇంధన భద్రతలో అంతరాయాల నుంచి మిలియన్ల మంది ప్రవాసుల జీవనోపాధి వరకు భారతదేశం గడ్డు పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.చమురు ధరల పెరుగుదల భారతదేశ ఇంధన భద్రతపై తక్కువగా అంచనా వేయలేమన్నారు.సంఘర్షణల నడుమ భారతదేశం మరో క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి భారత ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కల్యాణవేదిక వద్ద ప్రదర్శనశాలలను ప్రారంభించిన టీటీడీ ఈవో, అదనపు ఈవో

- భక్తులను ఆకట్టుకుంటున్న ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఆయుర్వేద, ఫొటో ప్రదర్శనశాలలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఫొటో ప్రదర్శనశాలలను టీటీడీ ఈ వో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రవేశ ద్వారంలో ఉంచిన దుర్యోధన పరాభవం, అటవీశాఖ ఏర్పాటు చేసిన శేషాచల శ్రేణుల సెట్టింగ్, టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర సాంప్రదాయ శిల్పక ళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన చెక్క, సిమెంట్, లోహ శిల్పాలను సందర్శించారు. నాడు-నేడు కాన్సెప్ట్‌తో టీటీడీ ప్రజాసంబంధాల విభాగంచే ఏర్పాటైన ఫోటో ఎగ్జిబిషన్లోని, తిరు మల, దేవాలయం మరియు ఇతర ముఖ్యమైన అంశాలకు సంబం ధించినఅరుదైన నాటి ఫోటోల సేకరణ, ప్రస్తుతం తిరుమల అబి వృద్ధి చెందిన తీరును తెలిపే చిత్రాలు ఉన్నాయి.వివిధ శాఖల వారీ గా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఈవో, అదనపు ఈవో అభినందిం చారు. జేఈవో గౌతమి, సివిఎస్‌వో శ్రీధర్, ఉద్యానవన డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాసులు, ఎస్వీ ప్రిన్సిపాల్‌వెంకట్రమణా రెడ్డి, సీపీఆర్‌వో డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి...
‘స్కిట్’లో తరగతులు

- ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్ ఛార్జి ఛైర్మన్ రామమోహన్ రావు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో నిర్వహిస్తూ నాలుగేళ్ల కిందట మూత బడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చే (2025-26) విద్యా సంవత్సరం నుంచి తరగతులు పునః ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఇన్ ఛార్జి ఛైర్మన్ రామమోహన్ రావు తెలిపారు. శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ గత నెల 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్ ఛార్జి ఛైర్మన్ రామమోహన్ రావు, ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్, జేఎన్ టీయూ (అనంతపురం) రిజిస్ట్రార్ కృష్ణయ్య మరి కొంతమంది అధికారులు, స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో కలసి స్కిట్ ఇంజ నీరింగ్ కళాశాలను పరిశీలించారు. కళాశాలలో ఉన్న ప్రయోగశాలలు, తరగతి గదులు వంటి మౌళిక వసతులు పరిశీలించారు. అదేవిధంగా స్కిట్ కళాశాల ఉద్యోగులతో మాట్లాడి... వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్కిట్ కళాశాలను జేఎన్ టీయూ (అనంతపురం)లోకి విలీనం చేస్తే ఇక్కడ ఉన్న ఉద్యోగులకు ఎలా న్యాయం చేయాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. న్యాయస్థానంలో ఉన్న ఉద్యోగుల కేసు విషయం కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ప్రభుత్వంతో చర్చించి ఏదో ఒక విధంగా స్కిట్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. అంతకు మునుపు రామమోహన్ రావు పాత్రికేయులతో మాట్లాడుతూ... స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో మౌళిక వసతులు ఎలా ఉన్నాయో చూస్తామన్నారు. ఇక్కడ పని చేపిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వివరాలు తెలుసుకుం టామన్నారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుతం దేవదాయశాఖ పరిధిలో ఉందని... దీనిని అనంతపురం జేఎన్ టీయూలో విలీనం చేయాలంటే ఏ విధానం అవలంభించాలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని రామమోహన్ రావు చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖకు మార్గదర్శకాలు ఇస్తుందన్నారు. ఆ తరువాత జేఎన్ టీయూ వారు ఈ కళాశాలను విలీనం చేసుకుంటారన్నారు. అప్పటి నుంచి ఇది జేఎన్ టీయూ స్కిట్ కళాశాలగా మారుతుందని ఆయన చెప్పారు. ఇప్పటికే పులివెందుల, కలికిరిలో జేఎన్ టీయూ కళాశాలలు ఉన్నాయన్నారు. విలీన ప్రక్రియ పూర్తయితే శ్రీకాళహ స్తిలో కూడా జేఎన్ టీయూ కళాశాల ప్రారంభమవుతుందని రామమోహన్ రావు చెప్పారు. స్కిట్ కళాశాల పూర్తిగా యూనివర్శిటీగా మారుతుం దన్నారు. అపుడు యూని వర్శిటీలో ఉన్న అన్ని వసతులు ఈ కళాశాలలో ఉంటాయన్నారు. స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తీసుకురావడం కష్టం కాదన్నారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కళాశాల లేనం దున ఇక్కడ తప్పకుండా స్కిట్ పునః ప్రారంభిస్తామన్నారు. స్కిట్ కళాశాలలో పాత కోర్సులే కాకుండా మార్కెట్ డిమాండు కోర్సులు కూడా ప్రారంబి స్తామన్నారు. సాధ్యయమైనంత వరకు ఇక్కడ పని చేసే ఉద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగులు కూడా కొంత రాజీ కావాల్సిన అవసరం ఉందని రామమోహన్ రావు అభిప్రాయపడ్డారు. జేఎన్ టీయూ వారు కూడా ఉద్యోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. స్కిట్ ఉద్యోగులు కోర్టులో వేసిన కేసును ఉపసంహరిం చుకున్న తరువాతే వారికి ఎలా న్యాయం చేయాలనే ప్రక్రియ మొదలవు తుందన్నారు. ఇవన్నీ చర్చించిన తరువాత అలసత్వం లేకుండా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని రామమోహన్ రావు చెప్పారు. ఏది ఏమైనా వచ్చే విద్యా సంవత్సరానికి స్కిట్ కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కళాశాలలో గతంలో ఉన్న ఐదు కోర్సులతో పాటు మార్కెట్ అవసరాలను బట్టి నూతన కోర్సులు కూడా ప్రారంభిస్తామని ఆయ న తెలిపారు. శ్రీకాళహస్తి ప్రజలకు ఈ కళాశాలను అంకితం చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి ముక్కంటి ఆలయం తరపున ఎలా సహకారం అందించాలో అలా అందచేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుతో చర్చించి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వవైభవం తెస్తామని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉద్యోగులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.